

అల్లర్లకు స్కెచ్!

- అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా జిల్లాలో పలుచోట్ల పొంచిఉన్న అల్లర్ల ముప్పు
- కౌంటింగ్‌కు ముందు, ఆ తర్వాత పిఠాపురం, కాకినాడ సిటీలో అల్లర్లకు ఛాన్స్
- పిఠాపురం, యు.కొత్తపల్లి, కాకినాడ దుమ్ములపేట, ఏటిమొగ, గాడిమొగ, విరవాడ ప్రాంతాల్లో ఘర్షణల ముప్పు
- ఈసీకి పంపిన నివేదికలో హెచ్చరించిన జిల్లా ఇంటెలిజెన్స్ అధికారులు
- పోలింగ్ రోజు సంఘటనలను ఉదహరిస్తూ ముప్పు తీవ్రతను వివరించిన వైనం
- అప్రమత్తమైన జిల్లా పోలీసుశాఖ.. ఏడు నియోజకవర్గాల్లో 42 పోలీస్ పికెట్‌లు ఏర్పాటు
- నాలుగు మొబైల్ క్విక్ రెస్పాన్స్ యాక్షన్ బృందాల నియామకం
- అల్లర్లకు పాల్పడే అవకాశం ఉన్న నేరస్తులు, రౌడీషీటర్ల గుర్తింపు ముమ్మరం

"అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి భయంతో వణికిపోతున్న అధికార వైసీపీ పోలింగ్ రోజున జిల్లాలో అనేక చోట్ల దౌర్జన్యాలు, దాడులకు తెగబడింది. అచ్చం అదే తరహాలో మళ్లీ ఓట్ల లెక్కింపు రోజున కూడా అల్లర్లకు పాల్పడే అవకాశం ఉందా.. ఓటమి భయంతో మళ్లీ రెచ్చిపోనుందా.. ఎక్కడికక్కడ గొడవలు, దాడులు, ఇతర అల్లర్లకు దిగబోతోందా... టీడీపీ, జనసేన నేతలను లక్ష్యంగా చేసుకుని కవ్వింపు చర్యలకు స్కెచ్ వేసిందా.. తమ పార్టీలో ఉన్న పలువురు పాత నేరస్తులు, రౌడీ షీటర్లను కౌంటింగ్‌కు ముందు, ఆ తర్వాత రెచ్చగొట్టనుందా.. అంటే అవుననే అంటున్నాయి జిల్లా ఇంటెలిజెన్స్ వర్గాలు. ఈమేరకు జిల్లాలో కౌంటింగ్‌కు ముందు, ఆ తర్వాత పలుచోట్ల అల్లర్లు జరిగే అవకాశం ఉన్నట్టు పసిగట్టాయి. ఈమేరకు ఈసీకి పంపిన నివేదికలో అల్లర్లకు సంబంధించి ఇంటెలిజెన్స్ పలు హెచ్చరికలు చేసింది. ప్రధానంగా పిఠాపురం, కాకినాడ సిటీ నియోజకవర్గాల్లో అల్లర్ల ముప్పు పొంచి ఉన్నట్టు నివేదికలో పేర్కొంది. దీంతో ఇంటెలిజెన్స్ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా పోలీసుశాఖ అప్రమత్తమైంది. అల్లర్లకు ఆస్కారం ఉన్న 42 ప్రాంతాల్లో పోలీసు పికెట్లు ఏర్పాటు చేస్తోంది. రౌడీషీటర్లు, పాత నేరస్తులను గుర్తించి బైండోవర్‌కు సిద్ధమవుతోంది."

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఈనెల 13న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో పలుచోట్ల అధికార వైసీపీ అరాచకం సృష్టించింది. ఓటమి భయంతో ఎక్కడికక్కడ దౌర్జన్యాలు, దాడులకు తెగబడింది. ముఖ్యంగా కాకినాడ సిటీలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి, ఆయన అనుచరులు హల్‌చల్ చేశారు. రామకృష్ణారావుపేట వద్ద పోలింగ్ కేంద్రాల వద్దకు వచ్చిన టీడీపీ నేతలపై దాడులకు దిగారు. ఏటిమొగ వద్ద కూడా వైసీపీ నేతలు కవ్వింపు చర్యలకు దిగారు. పిఠాపురంలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత, జనసేన నేతలకు మధ్య వాగ్వాదం జరిగింది. గొల్లప్రోలు జడ్పీ హైస్కూలు పోలింగ్ బూత్ సమీపంలో వైసీపీ, జనసేన నేతల మధ్య గొడవ జరిగింది. పిఠాపురం మండలం విరవాడలో వైసీపీ, జనసేన నేతల మధ్య ఘర్షణ జరిగింది. పోలింగ్ బూత్ దగ్గర్లో ప్రచారం చేస్తుండడంపై జనసేన నిలదీయడంతో వైసీపీ శ్రేణులు ఎదురు గొడవకు దిగాయి. అలాగే వైసీపీ నేతల తీరుపై ఆగ్రహంతో పిఠాపురంలో కొందరు 24వ వార్డు కౌన్సిలర్ ఇంటిపై రాళ్లు విసిరారు. జగ్గంపేట మండలం ఇర్రిపాక, గోవిందపురం, గోకవరం మండలం కృష్ణునిపాలెంలో వైసీపీ నేతలు టీడీపీ కార్యకర్తలపై దాడులకు దిగారు. తాళ్లరేవు మండలం కోరంగి పంచాయతీ చినబొడ్డు వెంకటాయపాలెం 216,217 పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల వద్దకు వెళ్లి వైసీపీ నేతలు ప్రచారం చేయడంపై టీడీపీ కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తంచేశారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. అలాగే పోలెకుర్రు పంచాయతీ పరిధిలోని తోటపేటలో 240 పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ నేతలు ప్రచారం చేస్తుండగా, టీడీపీ నేతలు అడ్డుకున్నారు. దీంతో వైసీపీ నేతలు ఎదురుతిరిగి టీడీపీ కార్యకర్తలను గాయపరిచారు. ఇలా అనేకచోట్ల వైసీపీ నేతలు ఓటమి భయంతో పోలింగ్ రోజు అల్లర్లు, దౌర్జన్యాలకు దిగారు. తర్వాత కూడా చాలాచోట్ల కవ్వింపు చర్యలకు దిగుతున్నారు. ఈ నేపథ్యంలో వచ్చే నెల 4వ తేదీన లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు సందర్భంగా జిల్లాలో అల్లర్లు జరిగే ముప్పు ఉన్నట్టు ఇంటెలిజెన్స్ హెచ్చరించింది. కౌంటింగ్‌కు రెండ్రోజుల ముందు, ఆ తర్వాత కూడా అల్లర్లు చోటుచేసుకునే ప్రమాదం ఉందని పేర్కొంది. ఈ మేరకు కాకినాడ జిల్లా ఇంటెలిజెన్స్ అధికారులు ఈసీకి కూలంకష నివేదిక పంపారు. ప్రధానంగా కాకినాడ సిటీ, పిఠాపురం నియోజకవర్గాల్లో అల్లర్లు ఎక్కువ జరిగే ప్రమాదం ఉందని నివేదికలో ఇంటెలిజెన్స్ హెచ్చరించింది. కాకినాడ సిటీలో ఏటిమొగ, దుమ్ములపేట, రామకృష్ణారావుపేట, పిఠాపురం నియోజకవర్గంలో విరవాడ, యు.కొత్తపల్లిలో పలు మత్స్యకార గ్రామాలు, తొండంగి, సెజ్ ప్రాంతం, గొల్లప్రోలు తదితర ప్రాంతాల్లో అల్లర్ల ముప్పు ఉందని వివరించింది. అందులోభాగంగా పోలింగ్‌రోజు చోటుచేసుకున్న ఉద్రిక్తలు, పలు ఘర్షణలను ఉదహరించింది. ఈసీకి నివేదిక అందడంతో జిల్లా పోలీసుశాఖ అప్రమత్తమైంది.

పికెటింగ్‌లు.. బైండోవర్లు...

ఈసీకి ఇంటెలిజెన్స్ నివేదికల నేపథ్యంలో జిల్లా పోలీసుశాఖ అప్రమత్తమైంది. అల్లర్ల ముప్పు పొంచి ఉన్న కాకినాడ సిటీ, పిఠాపురం నియోజకవర్గాలపై జిల్లా ఎస్పీ సతీష్ అప్రమత్తమ య్యారు. అలాగే గాడిమొగ, ఏటిమొగ, కోనపాపపేట, తొండంగి, వేమవరం, శృంగవృక్షం తదితర ప్రాంతాల్లోను గొడవలు జరిగే ప్రమాదం ఉన్నట్టు అంచనాకు వచ్చారు. పెద్దాపురం, తుని, జగ్గంపేట తదితర నియోజకవర్గాల్లో కౌటింగ్ రోజు గొడవలు, దాడుల ముప్పు ఉన్న ప్రాంతాలపైనా నిఘా ముమ్మరం చేశారు. అందులోభాగంగా జిల్లావ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అల్లర్లు, ఇతర గొడవలు జరిగే ఆస్కారం ఉన్న 42 ప్రాంతాల్లో పోలీస్ పికెటింగ్‌లు ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. కౌంటింగ్ పూర్తయిన రెండు రోజుల వరకు ఈ పికెటింగ్ కేంద్రాలు కొనసాగిస్తామని జిల్లా ఎస్పీ సతీష్ వివరించారు. అల్లర్లకు సంబంధించి ఏ చిన్న ఘర్షణలు జరిగినా త్వరితగతిన చేరుకునేందుకు వీలుగా జిల్లాలో నాలుగు మొబైల్ క్విక్ రెస్పాన్స్ యాక్షన్ టీంలను సిద్ధం చేశారు. ఇందులో సీఆర్పీఎఫ్ పోలీసు బలగాలు ఉంటాయి. అల్లర్లకు ఆస్కారం ఉందన్న ఇంటెలిజెన్స్ హెచ్చరికల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా పలుచోట్ల ఉన్న పాత నేరస్తులు, రౌడీ షీటర్లను గుర్తిస్తున్నామని 'ఆంధ్రజ్యోతి'కి ఎస్పీ వివరించారు. వీరందరినీ ఒకటి రెండు రోజుల్లో బైండోవర్ చేయబోతున్నట్టు ఆయన తెలిపారు. కాగా ఓట్ల లెక్కింపు జరిగే కాకినాడ జేఎన్టీయూ వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. స్ట్రాంగ్‌రూంల వద్ద మూడంచెల భద్రతలో భాగంగా ఇప్పటికే మొదటి లెవెల్‌లో కేంద్ర బలగాలు, రెండో లెవెల్‌లో స్టేట్ ఆర్మ్‌డ్ పోలీసు, మూడో అంచె కింద జిల్లా పోలీసులతో భద్రతాచర్యలు కొనసాగిస్తున్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్నికల ప్రక్రియ పూర్తిచేసేందుకు సన్నద్ధమవుతున్నారు. మరోపక్క ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత విజయోత్సవ ర్యాలీలపైనా నిషేధం విధించారు.





స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ జె.నివాస్, ఎస్పీ సతీష్‌కుమార్


స్ట్రాంగ్ రూమ్‌పై నిరంతర పర్యవేక్షణ

- ఓట్ల లెక్కింపునకు పకడ్బందీగా ఏర్పాట్లు
- కలెక్టర్ నివాస్

కలెక్టరేట్ (కాకినాడ),మే20: స్ట్రాంగ్‌రూమ్‌ల భద్రతను నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని, ఓట్ల లెక్కింపు ప్రక్రియకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్టు కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. సోమవారం కాకినాడ జేఎన్‌టీయూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీలోని ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ను, జేఎన్‌టీయూ స్టూడెంట్స్ క్యాంటీన్‌పైన ఏర్పాటుచేసిన సీసీ టీవీ కెమెరాల కంట్రోల్ రూమ్‌ను జిల్లా కలెక్టర్ జె.నివాస్, ఎస్పీ సతీష్‌కుమార్, రిటర్నింగ్ అధికారులతో కలిసి స్ట్రాంగ్‌రూమ్‌ల భద్రత వివరాలు అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేఎన్‌టీయూలో కాకినాడ జిల్లాకు సంబంధించి పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎంలు, ఇతర పోలింగ్ సామగ్రిని సురక్షితంగా భద్రపరచడం జరిగిందన్నారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్‌లకు సీల్ వేయడం జరిగిందన్నారు. స్ట్రాంగ్‌రూమ్‌లను సీసీ టీవీ కెమెరాలతో నిరంతరం పర్యక్షించడం జరుగుతుందన్నారు. పోటీ అభ్యర్థులు, ఏజెంట్లు స్ట్రాంగ్‌రూమ్‌ల భద్రతను పరిశీలించేందుకు వీలుగా క్యాంటీన్‌పైన ఉన్న యోగా సెంటర్‌లో సీసీటీవీ కెమెరాల కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటుచేశామన్నారు. స్ట్రాంగ్‌రూమ్‌ల భద్రతకు సంబంధించి ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతోపాటు షిఫ్ట్‌ల పద్ధతిలో ఒక గెజిటెడ్ అధికారి, ఒక పోలీస్ అధికారి, ఇతర సిబ్బంది నిత్యం పర్యవేక్షిస్తున్నారన్నారు. అభ్యర్థులు, ఏజెంట్లు స్ట్రాంగ్‌రూమ్‌ల భద్రత పట్ల ఏదైనా సందేహాలుంటే అధికారులను సంప్రదించవచ్చన్నారు. ఓట్ల లెక్కింపురోజున రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏజెంట్‌ల వాహనాల పార్కింగ్, ఏజెంట్లకు పాసులు ఇతర అంశాలపై పూర్తి సమాచారం తెలియజేయడం జరుగుతుందన్నారు. పాసులు ఉన్నవారు మాత్రమే లోపలికి అనుమతించడం జరుగుతుందన్నారు. గెలుపొందిన అభ్యర్థులు ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడానికి వీలులేదన్నారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. జేఎన్‌టీయూలో స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశామన్నారు. మొదటి లెవల్‌లో కేంద్ర బలగాలు, రెండో లెవల్‌లో స్టేట్ ఆర్మ్‌డ్ పోలీస్, మూడో లెవల్‌లో సివిల్ పోలీస్ ఫోర్స్‌ను పెట్టడం జరుగుతుందన్నారు. డీఎస్పీ, సీఐ, ఎస్ఐ ర్యాంక్ అధికారులతోపాటు మరో ముగ్గురు అధికారులు సమన్వయలోపం రానివ్వకుండా స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భద్రతను పర్యవేక్షిస్తున్నారన్నారు. కనీసం రెండు రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లను స్ట్రాంగ్‌రూమ్‌ల వద్దకు తీసుకువెళ్లి చూపించడం జరుగుతుందన్నారు. స్ట్రాంగ్‌రూమ్‌కు 100, 200 మీటర్ల పరిధిలో ఏ వాహనాలు లోపలికి రాకూడదన్నారు. రిటర్నింగ్ అధికారి వెంకటరావు, అధికారులు పాల్గొన్నారు.







మళ్లీ పెరుగుతున్నాయ్..


- కూరగాయల ధరలకు రెక్కలు
- దిగుబడులు లేకే పెరుగుదల

సామర్లకోట, మే 20: కూరగాయల ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. ప్రధానంగా పచ్చిమిర్చి ధర కిలో రూ.100కు చేరడం సామాన్య ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. వారం రోజుల వ్యవధిలోనే ధరల పెరుగుదలలో మార్పు కనిపిస్తోంది. వేసవి కావడం, డిమాండ్‌కు అనుగుణంగా కూరగాయల దిగుబడులు లేకపోవడమే ధరల పెరుగుదలకు ప్రధాన కారణం అని కూరగాయల వ్యాపారి స్వామి తెలిపారు. మొన్నటి వరకూ పచ్చిమిర్చి కిలో రూ.40 నుంచి రూ.50 ఉండగా ఆదివారం సామర్లకోట, పెద్దాపురం మార్కెట్లలో రూ.80కు చేరింది. ఇక బెండకాయలు, దొండకాయలు, బంగాళా దుంపలు, గోరుచిక్కుళ్ళు కిలో రూ.40 ఉండగా ప్రస్తుతం రూ.60కు చేరాయి. బీరకాయలు కిలో రూ.40 నుంచి రూ.80కు చేరాయి. వంకాయలు కిలో రూ.30 నుంచి రూ.50కు చేరాయి. నల్లవంకాయలు కిలో రూ.40 నుంచి రూ.60కు పెరిగాయి. దోసకాయలు కిలో రూ.30 ఉండగా ఆదివారం నాటి ధర రూ.40కు చేరింది. ఇక బీన్స్ మొన్నటి వరకూ కిలో రూ. 100 నుంచి రూ. 120లు ఉండగా ఆదివారం రూ.200కు చేరింది. ఇక బీట్‌రూట్, క్యారెట్ ధరల్లో కిలోకు రూ.20 చొప్పున పెరిగాయి. టమోటా కిలో రూ.20కు విక్రయాలు జరుగగా ప్రస్తుతం కిలో రూ.40కు చేరింది. కాప్సికం కిలో రూ.70 నుంచి ఏకంగా రూ.100కు చేరింది. ఉల్లిపాయలు కిలో రూ.20 నుంచి రూ.30కు చేరాయి. వెల్లుల్లి కిలో రూ.180 నుంచి రూ.220కు చేరాయి. చిలకడ దుంపలు కిలో రూ.60కు పెరగగా కాకరకాయలు కిలో రూ.50కు పెరిగాయి. కంద కిలో రూ.40 నుంచి రూ.60కు పెరిగాయి. అయినప్పటికీ ఆయా కూరగాయలు నాసిరకంగా ఉంటున్నాయని కొనుగోలుదారుల నుంచి వినిపిస్తోంది. ఇదే రీతిలో ఆకుకూరల ధరలు కూడా అమాంతంగా పెరిగాయి.

జిల్లాలో 81.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

కలెక్టరేట్ (కాకినాడ), మే20: జిల్లాలో 81.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఈమేరకు అధికారులు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో అత్యధికంగా పెదపూడి మండలంలో 25 మిల్లీమీటర్లు నమోదైంది. ఇక ఏలేశ్వరం మండలంలో 14.2 మిల్లీమీటర్లు, ప్రత్తిపాడు 8 ఎం.ఎం, గండేపల్లి 8ఎం.ఎం, పెద్దాపురం 4.8 ఎం.ఎం, సామర్లకోట 4.4ఎం.ఎం, కిర్లంపూడి 4.2 ఎం.ఎం, జగ్గంపేట 3.6 ఎం.ఎం, కోటనందూరు 3ఎం.ఎం నమోదైంది. అలాగే రౌతులపూడి 1.8, గొల్లప్రోలు 1.2, శంఖవరం 1 ఎం.ఎం వర్షపాతం నమోదైంది. జిల్లా సరాసరి వర్షపాతం 3.9 ఎం.ఎంగా ధ్రువీకరించారు.

పదికి కొత్త సిలబస్



సీబీఎస్ఈకి అనుబంధంగా పాఠ్యాంశాల రూపకల్పన.. ఏడు పుస్తకాల స్థానంలో 11 పాఠ్య పుస్తకాలు

సామర్లకోట/కిర్లంపూడి, మే 20: నూతన విద్యావిధానాన్ని అమలుచేస్తున్న ప్రభుత్వం రానున్న విద్యా సంవత్సరం నుంచి పదో తరగతిలో సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రవేశపెట్టనుంది. ఇందులో భాగంగా నూతన పాఠ్యాంశాలతో కూడిన పాఠ్యపుస్తకాలు మండల కేంద్రాలకు చేరుకుంటున్నాయి. గత ఏడాది తొమ్మిదో తరగతిలో సీబీఎస్ఈ సిలబస్‌ను అమలు చేయడంతో దానిని కొనసాగింపుగా ఈ ఏడాది పదో తరగతి సిలబస్ మొత్తాన్ని మార్చివేసింది. పాత సిలబస్‌కు భిన్నంగా ఉంటాయని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రవేశపెట్టేందుకు రంగం సిద్ధం చేసిన ప్రభుత్వం గత ఏడాది తొమ్మిదో తరగతి నుంచి ప్రయోగాత్మకంగా కొత్త పాఠ్యపుస్తకాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఆ విద్యార్థులంతా ఈ ఏడాది పదో తరగతిలోకి వస్తుండడంతో సిలబస్ కొనసాగింపుగా సీబీఎస్ఈని పోలేవిధంగా పాఠ్యాంశాలు రూపొందించారని అధికారులు చెబుతున్నారు. పాతసిలబస్‌లో తెలుగు, గణితం, ఆంగ్లం, సైన్స్, సోషల్, హిందీ టెక్స్ బుక్స్ ఉండేవి. కొత్త సిలబస్‌లో 11 రకాల టెక్స్ బుక్స్ ఉన్నాయి. తెలుగు వాచకం, ఉపవాచకం, జీవశాస్త్రం, జియోగ్రఫీ, సోషల్, హిస్టరీ, ఎకనామిక్స్, డెమొక్రటిక్ పాలిటిక్స్, గణితం, హిందీ వాచకం, ఉపవాచకం, ఇంగ్లీష్ వాచకం, ఉపవాచకంతో పాటు వర్క్ పుస్తకాలు ఉన్నాయి. సాధారణంగా పాఠశాలలో ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తుంటే విద్యార్థి శ్రద్ధగా విని ఆకళింపు చేసుకుని ఆ తరువాత వాటిని క్షుణ్ణంగా చదువుతుంటారు. అయితే కొత్త సిలబస్‌లో విద్యార్థులు స్వయంగా ప్రయోగం చేసి తనలోని నైపుణ్యాన్ని మెరుగుపరుచుకునేలా తీర్చిదిద్దారని కాకినాడ జిల్లా విద్యాశాఖ సీఎంవో చామంతి నాగేశ్వరరావు తెలిపారు. భవిష్యత్తులో ఉన్నత చదువులకు ఈ సిలబస్ ఎంతగానో దోహదపడుతుందని అన్నారు.

ఇక ఆరోగ్య సర్వే!



హెల్త్ సర్వే నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్‌ఫొటో)

- దీర్ఘకాలిక వ్యాధులపై ఇంటింటి సర్వే
- జూలై నుంచి చేపట్టేందుకు ఆరోగ్యశాఖ ఏర్పాట్లు
- ఆర్బీఎస్‌కే పీవోలకు తర్ఫీదు
- త్వరలో సిబ్బందికి అందనున్న శిక్షణ

పెద్దాపురం, మే 20: దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారిని గుర్తించేందుకు వీలుగా మరోసారి ఇంటింటి సర్వే చేపట్టేందుకు వైద్య ఆరోగ్యశాఖ సన్నద్ధమవుతోంది. గతంలో నాన్ కమ్యూనికబుల్ డిసీజ్ (ఎన్‌సీడీ) ఎన్‌సీడీ2.వో పేరుతో సర్వే నిర్వహించిన ఆరోగ్యశాఖ మరో విడత ఇంటింటి సర్వేకు సిద్ధమవుతోంది. ఎన్‌సీడీ3.వో పేరుతో జూలై మొదటి వారం నుంచి ఈ సర్వేను చేపట్టనుంది. ఇంటింటి సర్వేలో భాగంగా 18 ఏళ్లు పైబడిన వారి నుంచి ఆరోగ్య వివరాలను సేకరించనున్నారు. బీపీ, షుగర్, ఆస్ట్రియో ఆర్థరైటీస్ వంటి వ్యాధులతో పాటు క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించేందుకు వీలుగా రంగం సిద్ధమవుతోంది. రొమ్ము, సర్వైకల్, ఓరల్ క్యాన్సర్ నిర్ధారణకు సంబంధించి ఆరోగ్యశాఖ సిబ్బంది రోగుల ఇళ్ల వద్దే స్ర్కీనింగ్ చేపట్టనున్నారు. ఆరోగ్యశాఖకు చెందిన మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ ఏఎన్ఎం ఆధ్వర్యంలో సర్వే నిర్వహిస్తారు. రోగుల వివరాలను వీరికి కేటాయించిన యాప్‌లో పొందుపరుస్తారు. ఆయా గ్రామాలకు కేటాయించిన పీహెచ్‌సీలోని వైద్యులు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్) రోగుల వివరాలను పరిశీలించి, అవసరమనుకుంటే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అనుగుణంగా రిఫరల్ ఆసుపత్రులకు ఆరోగ్య శాఖ నెట్‌వర్క్ ఆసుపత్రులకు తరలించనున్నారు.

త్వరలో సిబ్బందికి శిక్షణ...

ఎన్‌సీడీ 3.వో సర్వే నిర్వహణకు సంబంధించి జిల్లా స్థాయిలో ఒక అధికారికి శిక్షణ ఇవ్వనున్నారు. తర్వాత శిక్షణ పొందిన అధికారి ఆధ్వర్యంలో జిల్లాలో సర్వే నిర్వహించనున్న ఆరోగ్యశాఖ సిబ్బందికి శిక్షణ ఇస్తారు. ఈనెలాఖరులోగా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి సిబ్బందికి శిక్షణ పూర్తిచేయనున్నారు. ఎన్‌సీడీ 3.వో సర్వేలో పూర్తిగా ప్రధానంగా క్యాన్సర్‌కు సంబంధించిన అంశాలపై దృష్టిసారించనున్నారు. ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో క్యాన్సర్ స్ర్కీనింగ్ చేయడానికి అధిక ప్రాధాన్యం ఇచ్చేలా ఆదేశాలు అందినట్టు తెలుస్తోంది.

అదుపుచేయడంపైనే దృష్టి

ఇటీవల దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ముఖ్యంగా చిన్నవయసులోనే షుగర్, బీపీ వంటి సమస్యలు చుట్టుముట్టడం, క్యాన్సర్ మహమ్మారి విజృంభించడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. సకాలంలో కొన్ని దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించడం ద్వారా ప్రాణాపాయం నుంచి రోగులను తప్పించేందుకు అవకాశం ఉంటుంది. ఈ ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సర్వేను చేపడుతున్నాయి. దీని ద్వారా వీలైనంత వరకూ దీర్ఘకాలిక అనారోగ్య సమస్యతో బాధపడే వారిని ముందుగానే గుర్తించి మెరుగైన వైద్యసేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ సర్వేతో అనారోగ్య సమస్య ఉందని తెలియని ఎంతోమందిని గుర్తించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆశా, ఏఎన్ఎం, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్, మెడికల్ ఆఫీసర్లకు శిక్షణ ఇచ్చేందుకు వీలుగా ఏర్పాట్లు చేయనున్నారు.

దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించేందుకే సర్వే

దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారిని గుర్తించేందుకు ఎన్‌సీడీ3.వో సర్వే చేపట్టడం జరుగుతుంది. జూలై మొదటివారం నుంచి ఈ సర్వే ప్రారంభమవుతుంది. బీపీ, షుగర్, ఆస్ట్రియో ఆర్థ్రరైటీస్ వంటి వ్యాధులతోపాటు రొమ్ము, సర్వైకల్, ఓరల్ క్యాన్సర్ నిర్ధారణకు సంబంధించి ఇంటింటి సర్వే చేపట్టడం జరుగుతుంది. దీనికి సంబంధించిన ఆదేశాలు అందాల్సి ఉంది.

- డాక్టర్ ఐ.ప్రభాకర్
ఎన్‌సీడీ ఆర్‌బీఎస్ పీవో, కాకినాడ



గోవలంక ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న కలెక్టర్ నివాస్

ఇసుక తరలించే వారిపై చర్యలు తప్పవు : కలెక్టర్ నివాస్

తాళ్లరేవు, మే 20: ఇసుక ర్యాంపుల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ జె.నివాస్ అన్నారు. సోమవారం తాళ్లరేవు మండలంలోని గోవలంక, పిల్లంక ఇసుక ర్యాంపులను కలెక్టరు పరిశీలించారు. ఇసుక ర్యాంపులు నిషేధితమని, ఇసుకను తీసేందుకు ఎటువంటి అనుమతులు లేవని, నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని నావలను సీజ్ చేస్తామన్నారు. కేంద్ర పాలిత ప్రాంతమైన యానాంకు చెందిన ఇసుక నావలకు ఎటువంటి అనుమతులు లేవని వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. ర్యాంపుల వద్ద రహదార్లకు గండ్లు కొట్టాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఇసుక ర్యాంపులపై స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంటు బ్యూరో స్టేషన్ పోలీసులకు జిల్లా కలెక్టరు పలు సూచనలు చేశారు. ర్యాంపులపై నిర్లక్ష్యం చేసిన అధికారులపై చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట కాకినాడ ఆర్డీవో ఇల్ల కిషోర్, మైనింగ్ ఏడీ, డీపీవో, ఎన్ఫోర్స్‌మెంట్ సీఐ రామకృష్ణదాస్, తహశీల్దార్ శ్రీనివాసరావు, ఆర్ఐ రవితేజ, పంచాయతీ కార్యదర్శులు, ఈవోపీఆర్డీ భైరవమూర్తి పాల్గొన్నారు.



గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న చైర్‌పర్సన్ భర్త, కౌన్సిలర్ గండ్రేటి

కోడ్ ఉల్లంఘించి బర్త్‌డే వేడుక

గొల్లప్రోలు, మే20: ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంది. దీన్ని బేఖాతరు చేస్తూ గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయ చైర్‌పర్సన్ చాంబర్‌లో సోమవారం దీపు అనే వైసీపీ కార్యకర్త పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. చైర్‌పర్సన్ భర్త, కౌన్సిలరు గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేసి వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడంపై జనసేన నాయకులు ఎన్నికల కమిషన్‌కు, రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు.





మోతుగూడెం: ఆంధ్ర, ఒడిశా సరిహద్దు గ్రామాల సమీపంలో కనువిందు చేస్తున్న మేఘాలు



ఉప్పాడ తీరంలో కనువిందు చేస్తున్న మేఘాలు

అబ్బురపరిచిన

వెండి మబ్బులు

వృద్ధురాలిపై యువకుల అత్యాచారం

గొల్లప్రోలు, మే 20: ఓ వృద్ధురాలిపై ఇద్దరు యువకులు అత్యాచారానికి పాల్పడిన సంఘటన కలకలం రేపింది. పట్టణానికి చెందిన 60 ఏళ్ల వృద్ధురాలి భర్త 30 సంవత్సరాల క్రితం చనిపోయాడు. అప్పటి నుంచి పట్టణంలో ఓ రైతుకు చెందిన మకాంలో గేదెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నది. ఆదివారం అర్ధరాత్రి సమయంలో వృద్ధురాలు నిద్రిస్తున్న సమయంలో ఇద్దరు యువకులు ఆమెపై బలవంతంగా అత్యాచారానికి పాల్పడ్డారు. దీంతో షాక్‌కు గురయిన ఆమె తేరుకోలేకపోయింది. సోమవారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో కుమారుడికి ఫోన్‌లో సమాచారం అందించింది. ఇద్దరు యువకులపై అనుమానం వ్యక్తం చేస్తూ బాధితురాలి కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గొల్లప్రోలు ఎస్‌ఐ బాలాజీ కేసు నమోదు చేశారు. వృద్ధురాలిని వైద్య పరీక్షల నిమిత్తం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ ఇంజనీరింగ్ విద్యార్థి మృతి

ఫెయిల్ కావడంతో మనస్తాపం

ఇటీవల పురుగుల మందు తాగిన వైనం



గొల్లప్రోలు రూరల్, మే 20: వరుసగా ఫెయిల్ అవుతుండటంతో మనస్తాపానికి గురైన ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం గోపాలపట్నం గ్రామానికి చెందిన కోనేటి రాజా నరేంద్ర(21) గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ సీఎస్ఈ విభాగంలో మూడో సంవత్సరం చదువుతున్నాడు. మొదటి రెండు సంవత్సరాలు ఇంజనీరింగ్ పరీక్షల్లో ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ నెల 4వ తేదీన ఇంజనీరింగ్ కళాశాల వెనుక ఉన్న జీడిమామిడి తోటలో పురుగుల మందు తాగాడు. విషయాన్ని తన సోదరుడు, హైదరాబాదులో ఉంటున్న సత్య సాయి కుమార్‌కు ఫోన్‌లో తెలిపాడు. దీనితో అతను తన స్నేహితుడిని అక్కడకు పంపి రాజా నరేంద్రను తొలుత ప్రైవేటు ఆసుపత్రికి, అక్కడ నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మరణించినట్లు గొల్లప్రోలు పోలీసులకు సోమవారం సాయి సత్యకుమార్ ఫిర్యాదు చేశారు. గొల్లప్రోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి



కొత్తపల్లి, మే 20: చెట్టుపై కల్లు గీస్తుండగా దురదృష్టవశాత్తు మోకు జారడంతో గీత కార్మికుడు చెట్టుపై నుంచి పడి అక్కడికక్కడే మృతిచెందాడు. కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం కొమరగిరి శివారు వెంకట రాయపురంలో సోమవారం ప్రతీ రోజూ మాదిరిగానే ఉదయాన్నే శీలం లక్ష్మణరావు(52) తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తున్నాడు. చెట్టుపై కల్లు గీస్తుండగా మోకు తాళ్లు తెగిపోవడంతో లక్ష్మణరావు ఒకేసారి కిందకు జారిపడ్డాడు. చెట్టుపై నుంచి కింద పడిన లక్ష్మణరావు అక్కడికక్కడే మృతిచెందాడు. లక్ష్మణరావుకు భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కొత్తపల్లి పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అరుంధతి నక్షత్ర దర్శనం

కల్యాణోత్సవాల్లో మూడో రోజు రత్నగిరిపై వివిధ కార్యక్రమాలు



అరుంధతి నక్షత్రం చూపిస్తున్న పండితులు



గ్రామోత్సవానికి హాజరైన భక్తులు

అన్నవరం, మే 20: సత్యదేవుడి వార్షిక దివ్య కల్యాణోత్సవాలలో భాగంగా మూడో రోజైన సోమవారం నవ దంపతులైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్ల అరుంధతి నక్షత్ర దర్శనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి 7 గంటలకు పండితులు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తూర్పురాజగోపురం వద్దకు మేళతాళాలతో తోడ్కొనివచ్చారు. ప్రత్యేకపూజలు అనంతరం దాంపత్యజీవితానికి ప్రతీకలైన వశిష్ట, అరుంధతి నక్షత్రాలను చూపించి వారికి అర్ఘ్యం అందించారు. అంతకు ముందు సాయంత్రం 5గంటలకు దర్బారు మండపంలో ప్రధాన ప్రవేశస్థాలిపాక హోమాలు జరిగాయి. ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పండితులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. వివాహం అనంతరం అమ్మవారు మెట్టినింటికి చేరుకుని అక్కడనుంచి మరో జీవన ప్రయాణానికి నాంది పలికేందుకు ప్రతీకగా ఈ వేడుక జరిగింది. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అందజేశారు.

రావణ వాహనంపై విహారం



సత్యదేవుడి వార్షిక కల్యాణోత్సవ గ్రామోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి స్వామి,అమ్మవార్లు రావణ వాహనంపై విహరించారు. వివిధ సాంస్కృతి కార్యక్రమాల నడుమ ఈ వేడుక కోలాహలంగా జరిగింది. స్వామివారి వాహన సేవలలో రావణ వాహనసేవకు అధిక ప్రాధాన్యం ఉండడంతో అన్నవరం పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో రావణ వాహన సేవను తిలకించారు. తప్పెటగుళ్లు, కోలాటం, వివిధ దేవతా మూర్తుల వేషధారణలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

సూర్యభగవానుడికి బూరెల సమర్పణ



బూరెలు సమర్పిస్తున్న దృశ్యం

అన్నవరం, మే 20: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో అత్యంత ప్రాముఖ్యమైన దివ్యకల్యాణం ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. అయితే కల్యాణానికి ముందు ఆకాశమంతా మేఘావృతమై వర్షంపడి అవాంతరాలు ఏర్పడతాయేమోనని భావించారు. అయితే వరుణుడి వర్షం నుంచి విముక్తి కల్పించడంతో సూర్యభగవానుడికి సోమవారం దేవస్థానం తరుపున దేవదాయ కమిషనర్ సత్యనారాయణ దంపతులు బూరెలు సమర్పించి మొక్కు చెల్లించారు. బూరెలను తూర్పురాజగోపురం వద్ద నుంచి ఆకాశం వైపునకు విసరారు. అంతకు ముందు కమిషనర్ దంపతులు సత్యదేవుడిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో రామచంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ యాపిల్స్

పోషకాలు మెండు



కడియం, మే 20: పుల్లపుల్లగా, తియ్యతీయగా ఉండే వాటర్ యాపిల్స్‌ను జంబోఫలం, గులాబీ జామ్ అంటారు. వేసవి తీవ్రతకు కలిగే దాహార్తి నుంచి ఉపశమనం కలిగేందుకు చల్లని నీరు, మజ్జిగ, కొబ్బరిబొండాం, లస్సీలు, జ్యూస్‌లు వంటి వాటిని తాగుతుంటాం. అలానే వీటితో పాటు మినరల్స్, సీ-విటమిన్ పుష్కలంగా ఉండే వాటర్ యాపిల్స్ కూడా మనకు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. కడియం నర్సరీలో వాటర్ యాపిల్స్ ఎరుపు, గ్రీన్, మల్టీకలర్ వంటి రంగుల్లో మనకు లభిస్తున్నాయి. వేసవిలో గుత్తులు, గుత్తులుగా కాసే ఈ వాటర్ యాపిల్స్‌లో మంచి పోషకాలు ఉండటంతో పాటు దాహార్తి నుంచి మనకు ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తాయనడంలో ఎటువంటి సందేహం లేదు. వాహనాల్లో ప్రయాణించే సమయంలోను, ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలోను వీటిని వెంట తీసుకెళితే దాహార్తిని తీర్చే ఔషధంగా ఎంతో మేలు చేస్తాయని నర్సరీ రైతులు అంటున్నారు. ఈ చెట్టు పెరిగే కొద్దీ ఫలాలతో పాటు మంచినీడ కూడా ఇస్తుంది. వాటర్ యాపిల్స్ మొక్కలను వాణిజ్య పంటగా కూడా వేసుకుంటే మంచి లాభాలు ఉంటాయని. నల్లరేగడి భూములతో పాటు, ఎర్రనేలల్లో కూడా ఈ మొక్కలు బాగా పెరుగుతూ మంచి ఫలాలను ఇస్తాయని నర్సరీ రైతులు చెబుతున్నారు.

అధికారుల 'సరిహద్దు' మాయ

ఇసుక అక్రమ తవ్వకాలపై తప్పించుకునే యత్నం

తీపర్రు, ఉసులుమర్రులో యథేచ్ఛగా తవ్వకాలు

ఇటీవల పరిశీలించిన తూర్పు అధికారులు

ఆ సరిహద్దు కోనసీమదంటూ దాటవేత

అది తప్పంటున్న రెండు గ్రామాల ప్రజలు



తీపర్రు ర్యాంప్‌లో ఇసుక తవ్వుతున్న దృశ్యం (ఫైల్)

పెరవలి, మే 20: గోదావరి నదిలో ఇసుక అక్రమ తవ్వకాలపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆయా శాఖల అధికారుల్లో కదలిక వచ్చి ఆగమేఘాలపై పరుగులు తీశారు. అయితే తిమ్మిని బమ్మిని చేసి అక్రమాలు గుట్టు తేలకుండా అంతా సవ్యంగానే ఉన్నట్టు నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. తీపర్రు ఇసుక ర్యాంప్‌లో మూడు నెలలుగా జరిపిన ఇసుక అక్రమాలపై తీపర్రు, ఉసులుమర్రుకు చెందిన ప్రజానీకం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భారీ అంచనాలతో ఇష్టారాజ్యంగా వందలాది లారీలు ఇసుక తవ్వుకుని పోతుంటే ఏమి పట్టనట్టు వ్యవహరించిన అధికార యంత్రాంగం సాఫీగా వచ్చి ఏమీ జరగనట్టుగా ఉండడం విడ్డూరమని వ్యాఖ్యానిస్తున్నారు. ఇక్కడ అక్రమ తవ్వకాలకు తామే సాక్ష్యమని, ఏ అధికారి వచ్చినా ఏ మేరకు ఇసుక తవ్వకాలు జరిగాయో చెబుతామంటున్నారు. తూర్పుగోదావరి జిల్లా వైపునకు తీపర్రు గ్రామం చేర్చి ఉన్నప్పటికీ ఇసుక తవ్వకాలు అన్ని కోనసీమ జిల్లా పరిధిలో జరిగినట్టు అధికారులు చెప్పడం విడ్డూరమంటున్నారు. గత 30 ఏళ్లుగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని, ఇటువంటి పరిధులు ఎప్పుడూ అధికారులు నుంచి వినలేదని చెబుతున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి వివిధ శాఖల అధికారులే ఇక్కడ తనిఖీలు జరిపి కేసులు నమోదు చేసేవారని, అక్రమ తవ్వకాలపై జరిమానాలు కూడా విధించేవారని గుర్తు చేస్తున్నారు. ప్రస్తుతం దానికి విరుద్ధంగా కొత్త జిల్లాలు ఏర్పడిన అనంతరం ఈ ప్రాంతం తూర్పుగోదావరిలోకి, గోదావరి అవతలి ప్రాంతం కోనసీమ జిల్లాలోకి మారాయి. దీంతో అవతలి వైపు భాగాన్ని కోనసీమ జిల్లా అధికారులు పరిశీలించాలని ఇక్కడి అధికారులు చేతులు దులుపుకోవడం సబబు కాదని పేర్కొంటున్నారు. అయితే కోనసీమ జిల్లా అధికారులైనా స్పందించి ఈ ప్రాంతానికి వచ్చి విచారిస్తే తాము సాక్ష్యాధారాలతో అక్రమ తవ్వకాల బాగోతం బయటపెడతామని ఇక్కడి ప్రజలు చెబుతున్నారు. ప్రతిమ కంపెనీకి 2025 సంవత్సరం వరకు అనుమతులు ఉన్నాయని చెబుతున్న అధికారులు అసలు ఆ కంపెనీకి ఏ జిల్లా అధికారులు అనుమతులు ఇచ్చారో, దానికి నిర్ణయించిన పరిధులు ఏమిటో, ఎన్ని క్యూబిక్ మీటర్లు ఉంటాయో తెలియజేయాలని డిమాండ్ చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా అధికారుల అనుమతి పొంది కోనసీమ జిల్లా పరిధిలో ఇసుక తవ్వకాలు జరిపితే అవి అక్రమ తవ్వకాలే కాబట్టి వెంటనే కోనసీమ జిల్లా అధికారులు స్పందించి కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ అక్రమ తవ్వకాలు తమతో పాటు తూర్పుగోదావరి జిల్లా మైనింగ్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు కూడా సాక్ష్యం చెబుతారని, అక్రమంగా తవ్విన ఇసుక గుట్టలు కూడా నిడదవోలు-నరసాపురం రహదారి పక్కన ఉన్నాయని పేర్కొంటున్నారు. కోనసీమ జిల్లా అధికారులు వెంటనే స్పందించి విచారణ చేపట్టాలని, ఆ గుట్టలు కూడా తరలిపోతే ఇసుక అక్రమ తవ్వకాల సాక్ష్యం లేకుండా పోతుందని పేర్కొంటున్నారు.

మట్టి తరలింపు వాహనాలు సీజ్



వాహనాలను సీజ్ చేసిన అధికారులు



కరప, మే 20: కరప మండలం యండమూరులోని చేలల్లో మట్టిని తరలిస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు సంయుక్త దాడులు నిర్వహించారు. పెద్దాపురప్పాడు గ్రామానికి చెందిన ఏడు ట్రాక్టర్లను సీజ్ చేసి కరప పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఒక్కో మట్టి ట్రాక్టర్‌కు రూ.3 వేలు చొప్పున పెనాల్టీ విధించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ వాసిరెడ్డి రామకోటేశ్వరరావు మాట్లాడుతూ అనుమతులు లేకుండా మళ్లల్లో మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మట్టి ట్రాక్టర్ రోడ్డెక్కితే వెంటనే వాటిని సీజ్ చేయాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. పొలాల్లో మెరకలు తీసుకోవాలంటే సంబంధిత రైతు ముందుగా తహశీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. స్థానిక వీఆర్‌వోతో విచారణ చేయించి మళ్లల్లో మట్టిని మళ్లల్లోనే సర్దుబాటు చేసుకునేలా అనుమతినిస్తామన్నారు. కాగా పెదకొత్తూరు, కరప, కొరుపల్లి, గొడ్డటిపాలెం, అరట్లకట్ట, కూరాడ, పెనుగుదురు తదితర గ్రామాల్లో మళ్లల్లోని మట్టిని ఇటుక బట్టీల్లోకి, దిమ్మలకు యథేచ్ఛగా తరలించుకుపోతున్నారు. అయితే అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ట్రాక్టర్ తొట్టి నుంచి మట్టి అండలు రోడ్డుపై పడి చినుకులకు తడిచి వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి వచ్చిందంటే గ్రామాల్లో మట్టి మాఫియా చేస్తున్న ఆగడాలను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

నయా మామిడి!


మార్కెట్లోకి కొత్త రకాలు



బనానా మేంగో



మియాజాకీ మామిడి



థాయిలాండ్ వైట్ మేంగో

కడియం, మే 20: కడియం నర్సరీ రైతులు విభిన్న మామిడి పండ్ల రకాలను పండిస్తున్నారు. బనానా, థాయిలాండ్ వైట్, మియాజాకీ తదితర రకాల మామిడి మొక్కలను తీసుకువచ్చి ఉత్పత్తి చేస్తున్నారు. ప్రస్తుతం కడియం నర్సరీల్లో ఈ సరికొత్త మొక్కలను పెంచుతున్నారు. కొత్తరకం మొక్కలను ప్రస్తుతం తోటలుగా వేసేందుకు, అలానే మార్కెటింగ్, నేల స్వభావం వంటి పరిస్థితులను ఆలోచించి రైతులు వీటిని పెంచడానికి ఉత్సాహం చూపుతున్నారు.

పండూరి మామిడి

చూడడానికి ఈ మామిడి పండ్లు పిందెల్లాగా కనిపిస్తాయి. ఆకుపచ్చని మామిడిపండ్లపై చిన్నచిన్న చుక్కలు ఉంటాయి. తింటే గాని వీటి మధురం తెలియదు. మిగలముగ్గిన పండు తొక్క కూడా ఆకుపచ్చగానే ఉంటుంది. ధరలోనూ ప్రియమే.

ఆల్ఫాన్సా మామిడి

హైబ్రిడైజేషన్‌తో పుట్టుకొచ్చిన సరికొత్త మామిడి ఆల్ఫాన్సా రైతులను ఆర్థికంగా నిలదొక్కేందుకు కూడా ఎంతో ఉపకరిస్తాయి. గాలి వానల సమయంలో రాలకుండా ఉండడం వీటి ప్రత్యేకత. తేనెలొలికే తియ్యదనం మరో ప్రత్యేకత. వీటికి మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువ.

బరామాస మామిడి

బరామాస ఏడాది పొడవునా కాస్తూ వేసవిలో అధికంగా కాయలు ఇస్తుంది. ఈ రకం మామిడి పండ్లు నిగనిగలాడుతూ పలకరించినట్లు ఉంటాయి. ఎక్కువ రోజులు నిల్వ ఉండడం వీటి ప్రత్యేకత. పీచు పదార్థం ఎక్కువగా ఉండడంతో పాటు టెంకభాగం వరకు గుజ్జు ఉంటుంది.

కొత్తరకాల మొక్కలు

బనానా మామిడి

ఇతర దేశాల నుంచి తీసుకువచ్చి పెంచుతున్న ఈ మామిడి అరటిపండులా సన్నగా, పొడవుగా ఉంటుంది. టెంక సన్నంగా ఉంటుంది. ఈ మామిడి తింటుంటే జ్యూస్ తాగినంత మధురానుభూతి కలుగుతుందని నర్సరీ రైతు జానకీరామ్(నాని) తెలిపారు.

థాయిలాండ్ వైట్‌మామిడి

ఈ చెట్టు వేసిన 3, 4 ఏళ్లకే కాపు కొస్తాయని నర్సరీ రైతు చెబుతున్నారు. ఈ ఫలాన్ని ముక్కలుగా కోసుకుని ఆరగిస్తుంటారు.

ఘనంగా భావనారాయణస్వామి గ్రామోత్సవం



సర్పవరం జంక్షన్, మే 20: కాకినాడ రూరల్ మండలం సర్పవరంలో శ్రీ రాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి దివ్య వార్షిక కల్యాణోత్సవాలు గత నాలుగు రోజులుగా భక్తుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. దేవదాయ,ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి అత్యంత వైభవంగా స్వామివారి కల్యాణం నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవాలను స్వయంగా తిలకించలేని భక్తుల కోసం సోమవారం రాత్రి నూతన వస్త్రాలు, విశేష పుష్పాలంకరణతో ఉన్న కల్యాణ దంపతులు శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి వారిని సింహవాహనంపై కొలువుదీర్చి మాఢ వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు మాట్లాడుతూ స్వామివారి కల్యాణాన్ని స్వయంగా వీక్షించలేని భక్తులు, వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్య రుగ్మతలతో ఇంటి వద్దే ఉండిపోయిన వారి క్షేమాన్ని ఆకాంక్షిస్తూ స్వామివారిని గ్రామోత్సవం చేసినట్లు తెలిపారు.

లిఫ్ట్‌లో ఇరుక్కుపోయిన భక్తులు

అన్నవరం, మే 20: సత్యదేవుడి దర్శనానికి విచ్చేసిన ఒక భక్తబృందం సోమవారం రైల్వేస్టేషన్‌లో ఉన్న లిఫ్ట్‌లో సాంకేతికలోపం కారణంగా సుమారు గంటపాటు ఇరుక్కుపోయి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విజయవాడకు చెందిన 10 మంది బృందం ఆదివారం సత్యదేవుడి దివ్యకల్యాణం వీక్షించేందుకు విచ్చేసి తిరుగు ప్రయాణంలో ఉదయం 12.45కు రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. మూడో నంబరు ప్లాట్‌ఫాం నుంచి ఒకటో నెంబరుకు వెళ్లేందుకు లిఫ్ట్ ఎక్కగా మధ్యలో నిలిచిపోయింది. సుమారు గంటసేపు దానిలో ఉండిపోయారు. అయితే సాంకేతిక సిబ్బంది అన్నవరంలో లేకపోవడంతో ఉన్నతాధికారులకు అన్నవరం స్టేషన్ సిబ్బంది సమాచారం ఇచ్చారు. వారి రాక ఆలస్యమవడంతో లిఫ్ట్ పైభాగం విప్పి సరిచేశారు. ఈ భక్త బృందం రత్నాచల్‌లో విజయవాడ చేరుకున్నారు. నరకం అనుభవించామని ఇంత పెద్ద పుణ్యక్షేత్రం కలిగిన రైల్వేస్టేషన్‌లో లిఫ్ట్ సాంకేతిక బృందం లేకపోవడం బాధాకరమని ప్రయాణికులు వాపోయారు.

ఏపీఈఏపీ సెట్‌కు రెండు సెషన్లలో 2176 మంది హాజరు

జేఎన్టీయూకే, మే 20: కాకినాడ జిల్లాలోని 5 పరీక్షా కేంద్రాల్లో ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి సోమవారం ఉదయం నిర్వహించిన పరీక్షకు 1,112 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1079 మంది హాజరయ్యారని, 33 మంది గైర్హాజరు కాగా 97.03 శాతం హాజరు నమోదైనట్లు కన్వీనర్ ప్రొఫెసర్ కె.వెంకటరెడ్డి తెలిపారు. అదే విధంగా మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 1,116 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1097 మంది హాజరయ్యారని, 19 మంది గైర్హాజరు కాగా 98.30 శాతం హాజరు నమోదైందన్నారు. మొత్తం రెండు సెషన్‌లలో 2,228 మంది హాజరుకావాల్సి ఉండగా 2,176 మంది హాజరయ్యారని 52 మంది పరీక్ష రాయలేదని 97.67 శాతం హాజరు నమోదైనట్లు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలో ఇంజనీరింగ్‌లో ప్రవేశాల కోసం రాజమహేంద్రవరం ఐయాన్ డిజిటల్ కేంద్రంలో ఆన్‌లైన్‌లో రెండు సెషన్‌లలో నిర్వహించిన పరీక్షకు 1377 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1341 మంది హాజరయ్యారని, 36 మంది పరీక్ష రాయలేదని మొత్తం 97.39 శాతం హాజరు నమోదైందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని భట్లపాలెంలో గల బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో రెండు సెషన్లలో నిర్వహించిన ఇంజనీరింగ్ విభాగ పరీక్షకు 690 మంది హాజరు కావాల్సి ఉండగా 680 మంది హాజరయ్యారని 10 మంది గైర్హాజరు కాగా మొత్తం 98.55 శాతం హాజరు నమోదైనట్లు కన్వీనర్ తెలిపారు. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన ప్రవేశ పరీక్షలు ఈనెల 23 వరకూ కొనసాగుతాయన్నారు.

కాకినాడ

జాబ్‌మేళాకు హాజరైనవారికి

23, 24 తేదీల్లో రాత పరీక్ష

కార్పొరేషన్ (కాకినాడ), మే 20: ఈనెల 18వతేదీన ఐటీఐ విద్యార్థులకు నిర్వహించిన జాబ్‌మేళాకు హాజరై రిజిస్టర్ చేయించుకున్న వారికి ఈనెల 23,24తేదీల్లో రాత పరీక్ష నిర్వహించడం జరుగుతుందని కన్వీనర్ తెలిపారు. ఫిట్టర్, సివిల్, వెల్డర్, ప్లంబర్, కార్పెంటరీ అభ్యర్థులంతా ఆయా తేదీల్లో జరిగే పరీక్షకు ఆధార్‌కార్డు జెరాక్స్ కాపీలతో హాజరుకావాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ సిటీ, మే 20: వార్షిక మరమ్మతుల్లో భాగంగా కాకినాడ డెయిరీఫారమ్ విద్యుత్ కేంద్రం పరిధిలో మంగళవారం సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈపీడీసీఎల్ ఈఈ ప్రసాద్ తెలిపారు. డెయిరీ ఫారమ్, దుమ్ములపేట, పల్లంరాజునగర్, సాంబమూర్తినగర్, అయోధ్యనగర్, రాజీవ్ గృహకల్ప, రెవిన్యూ కాలనీ, సత్యనగర్ తదితర ప్రాంతాలలో సరఫరా ఉండదన్నారు.

సామర్లకోటలో...

సామర్లకోట: సామర్లకోట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పలు లైన్ల మరమ్మతుల్లో భాగంగా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ అన్నపూర్ణమ్మ ఆలయం ఫీడర్ పరిధిలో బళ్ళ మార్కెట్, వీర్రాఘవపురం, విఘ్నేశ్వరా థియేటర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నటు విద్యుత్ కార్యనిర్వాహక ఇంజనీర్ ఏవీఎస్‌డీఎస్.ప్రభాకర్ సోమవారం సాయంత్రం తెలిపారు.

నేడు అలయన్స్ క్లబ్ జిల్లా కాన్ఫరెన్స్

కాకినాడ సిటీ, మే 20: కాకినాడ కాస్మో పొలిటిన్ క్లబ్ హాల్‌లో మంగళవారం ఉదయం 9 గంటలకు అలయన్స్ క్లబ్ జిల్లా కాన్ఫరెన్స్, జిల్లా కేబినెట్ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమాలు జరగనున్నాయని అలయన్స్ క్లబ్ పీఆర్‌వో దిలీప్‌కుమార్ సదనాని తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో 2024-25 సంవత్సరానికి కేబినెట్ సభ్యులు ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. జిల్లా గవర్నర్ వనుం శ్రీనివాసరావు అధ్యక్షత వహిస్తారని తెలిపారు. ముఖ్య అతిథిగా క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ సి.బాలచంద్రన్ విచ్చేస్తారన్నారు. ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్ డీబీజీ శాస్త్రి, రెండవ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ బి తిరుపతిరాజుల ద్వారా కొత్త క్లబ్ ఇన్‌స్టాలేషన్,పలు కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

1న హనుమాన్ శోభా యాత్ర

పెద్దాపురం, మే 20: పెద్దాపురంలో వచ్చే నెల 1న వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్, ఆర్‌ఎస్‌ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో హనుమాన్ శోభా యాత్రతో పాటు అభిషేకములు, పారాయణ కార్యక్రమాలను జరుగుతాయని ఆయా సంఘాలకు చెందిన ప్రతినిధులు మాలి సురేష్, మట్టే శ్రీనివాసరావు, ఖండవిల్లి సూర్యనారాయణ తెలిపారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఈకార్యక్రమాలను ప్రముఖ వేదపండితులు చిట్టెం హరిగోపాలశర్మ పర్యవేక్షణలో చేపడతామన్నారు. హనుమాన్ జన్మదినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

25న ప్రత్తిపాడు సర్వసభ్య సమావేశం

ప్రత్తిపాడు, మే 20: ప్రత్తిపాడు మండలం సర్వసభ్య సమావేశం ఈ నెల 25న నిర్వహించనున్నట్టు ఎంపీడీవో డేవిడ్ రాజు సోమవారం తెలిపారు. మండలాభివృద్ధిపై సమీక్షించే ఈ సమావేశానికి ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్ అధ్యక్షతన వహిస్తారని మండల పరిషత్ పాలకవర్గ సభ్యులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

'త్వరితగతిన జీతాలు ఇప్పించాలి'

కాకినాడ సిటీ, మే 20: ఇటీవల కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ ఉద్యోగులుగా పరిగణించినందున, వారందరికీ కూడా త్వరితగతిన ట్రెజరీ ద్వారా జీతాలు ఇప్పించాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు గుద్దటి రామ్మోహనరావు, కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా నిర్వహించారని జిల్లా కలెక్టర్‌ను కలిసి అభినందించారు. కాకినాడ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం గతం కంటే ఎక్కువగా నమోదైందన్నారు. స్వీప్ ద్వారా ఓటరును చైతన్యం చేసి పోలింగ్ బూత్ వరకు వచ్చేలా అన్ని ఏర్పాట్లు చక్కగా చేశారన్నారు. అలాగే ఉద్యోగ, ఉపాధ్యాయులు, పోలింగ్ సిబ్బంది చాలా బాగా పని చేశారని, రాత్రయ్యేవరకు పోలింగ్ జరిగినా ఉద్యోగులు కష్టపడి పనిచేశారని అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వివిధ తాలూకా యూనిట్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

'సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి'

కిర్లంపూడి, మే 20: మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో గ్రామాల్లో ప్రజలు సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని కిర్లంపూడి వైద్యాధికారి డాక్టర్ రాంబాబునాయక్ అన్నారు. ఉదయం నుంచి ఎండకాసి ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో జ్వరాలు, తలనొప్పి, దగ్గు, కీళ్ల నొప్పులు వంటి వ్యాధులతో బాధపడతారని తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మందు వేసవిని దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. వ్యాధి తీవ్రత బట్టి ఆసుపత్రికి వెళ్లాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో గ్రామాల్లో వ్యాధుల పట్ల వైద్యులు అన్ని పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవాలన్నారు.

'వేసవి అలవెన్సు రెండేళ్ల క్రితమే నిలుపుదల'

గండేపల్లి, మే 20: ఉపాధి కూలీలకు వేసవి అలవెన్సులు ఇవ్వడంలేదని, వేతనాలు సక్రమంగా రావడంలేదని, ఎండల్లో టెంట్లు కూడా ఏర్పాటు చేయలేదని ఈనెల 16వతేదీన ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి సోమవారం ఉపాధి హామీ మండలాధికారులు స్పందించారు. ఏపీవో గంగాభవానీ మాట్లాడుతూ వేసవి అలవెన్సు ప్రభుత్వం రెండు సంవత్సరాల క్రితమే తీసేసిందన్నారు. అలాగే గతంలో ఇచ్చిన టెంట్లన్నీ చిరిగి పోయాయని అందుకే టెంట్లు వేయకుండా తాటాకులతో ప్రత్యామ్నాయంగా వేశామన్నారు. పెండింగ్‌లో వేతనాలన్నీ కూడా కూలీల ఖాతాల్లో పడ్డాయని, ఒకట్రెండు వారాలు తప్ప పెండింగ్ ఏం లేదన్నారు. అలాగే ఎప్పటికప్పుడు ఉపాధి పనులు పరిశీలించడం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరం 4వేల మంది పనిచేయాల్సిన టార్గెట్ ఉండగా సుమారు 3500మందికిపైగా పనుల్లో పాల్గొంటున్నారని ఆమె తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడికి గాయాలు

కరప, మే 20: కరప మండలం పెనుగుదురు ప్రధాన రహదారిపై ఆర్టీసీ బస్సు ఢీకొని ఒక యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. కాకినాడరూరల్ మండలం రాజుల తూరంగి గ్రామానికి చెందిన మేడిశెట్టి నాగబాబు టైల్స్ వర్క్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా నాగబాబు ఆదివారం సాయంత్రం మోటర్‌సైకిల్‌పై కరప వచ్చి తిరిగి తూరంగి బయలుదేరాడు. పెనుగుదురు బ్రిడ్జి దిగుతుండగా కాకినాడ నుంచి రామచంద్రపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సు అతన్ని ఢీకొంది. తలకు తీవ్ర గాయాలైన నాగబాబును చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడి తల్లి లక్ష్మీ నరసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ టి.రామకృష్ణ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

జగ్గంపేట, మే 20: జగ్గంపేట సచివాలయం2 ప్రాంగణం వద్ద కాకినాడ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పలు విభాగాలకు చెందిన వైద్యులు 235 మందికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. జగ్గంపేట వైసీపీ సీనియర్ నేత జ్యోతుల రామస్వామి, ఎంపీపీ అత్తులూరి నాగబాబు, ఉపసర్పంచ్ బండారు రాజా, మండల కో ఆప్షన్ సభ్యులు జాన్‌వెస్లీ శిబిరం ప్రారంభించారు.

తోపుడుబండ్ల సంఘం మాజీ అధ్యక్షుడు మృతి

జగ్గంపేట, మే 20: జగ్గంపేటకు చెందిన తోపుడుబండ్ల సంఘం మాజీ అధ్యక్షుడు కొండూరు సుబ్బారావు సోమవారం ఉదయం మరణించారు. జగ్గంపేట టీడీపీ అభ్యర్థి జ్యోతుల నెహ్రూ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఎస్‌వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, సత్తి సదాశివరెడ్డితో పాటు పలువురు నివాళులర్పించారు.

డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేదెప్పుడు?

నీట మునుగుతున్న జగ్గంపేట ప్రధాన రహదారులు

జగ్గంపేట, మే 20: జగ్గంపేటలో తక్షణం ప్రత్యేక నిధులతో ప్రధాన పంటకాలువలతోపాటు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి వర్షపు నీరు గ్రామాల్లో చేరకుండా దిగువకు చేరేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. వర్షాలకు నీటి ప్రవాహం, కాలువల ద్వారా జగ్గంపేట ప్రధాన రహదారులు, ఎస్సీపేట, సంఘంపువీధి, పల్లపు వీధి, శెట్టిబలిజపేటలకు నీట మునుగుతూ వస్తున్నాయి. ఇటీవల కురిసిన అకాల వర్షాలు కారణంగా రోడ్లు జలమయం అయ్యాయి. ప్రధానంగా జగ్గంపేట సెంటర్‌కు దగ్గరలో వీరమ్మచెరువు కాలువ పూర్తిగా మూసుకుపోవడంతో పాటు గ్రామంలో ఏర్పాటు చేసిన డ్రైన్‌కుంగిపోవడంతో నీరు దిగువకు వెళ్లకుండా గ్రామంలోనే ఉండిపోతూ వస్తుంది. ఇకపోతే ప్రధాన డ్రైన్‌లు ఎక్కడికక్కడ కుంగిపోవడంతో పాటు మరమ్మతులు చేపట్టకపోవడంతో చెత్తాచెదారం నిండిపోవడంతో మురుగునీరు ప్రవాహంతో పాటు వర్షం వచ్చిందంటేచాలు పట్టణంలో గల రోడ్లు అన్ని పూర్తిగా డ్రైన్‌లో నీటితో రోడ్లపై చెత్తాచెదారాలతో కొట్టుకొస్తున్నాయి. దీనికితో తోడు పల్లపు ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్థమైంది. దీనిపై ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోకపోవడంతో చినుకుపడిదంటేచాలు పట్టణంలోకి భారీగా నీరు వచ్చి కంటిమీద కనుకులేకుండా గడపాల్సి వస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణం డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి నీరు రాకుండా చేయాలని కోరుతున్నారు.



వర్షాలకు జగ్గంపేట లోని ఓ కాలనీలోకి వస్తున్న మురుగునీరు (ఫైల్‌ఫొటో)

ఎండ..చిరుజల్లులు..ఉక్కపోత!

విభిన్న వాతావరణంతో ప్రజల ఇక్కట్లు

పిఠాపురం, మే 20: విభిన్న వాతావరణ పరిస్థితులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో వాతావరణంలో మార్పులు కనిపిస్తున్నాయి. ఆకాశం మేఘావృతమవుతున్నప్పటికి ఎండ కాస్తున్నది. ఆది, సోమవారాల్లో ఇదే పరిస్థితి ఉంది. ఉదయం నుంచి ఎండతీవ్రత గణనీయంగా పెరిగింది. బయటకు వస్తే చాలు ఎండ స్రుమనిపించింది. మధ్యాహ్నం, సాయంత్రం పది నిమిషాలు పాటు చిరుజల్లులు పడ్డాయి అంతే ఉక్కపోత అధికమైంది. గాలి వీయక, ఉక్కపోతతో ప్రజలు సతమయ్యారు. సాయంత్రం 6గంటల వరకూ ఇదే విధంగా ఉండగా ఆ తర్వాత ఆకాశంలో దట్టంగా మబ్బులు అలముకుని గాలులు వీచాయి. వర్షం కురవకపోయినా వాతావరణం కొంత మేర చల్లబడటంతో ప్రజలు సేదతీరారు.



పిఠాపురంలో దట్టంగా అలుముకున్న మబ్బులు

కిర్లంపూడిలో భారీ వర్షం

కిర్లంపూడి, మే 20: కిర్లంపూడిలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఆకాశం మేఘావృతమై ఒక్కసారిగా సాయంత్రం వర్షం కురవడం తో అందరూ సేదతీరారు. రోడ్లపై నీరు పొంగిపొర్లింది. ప్రధాన రహదారులపై నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు ఇక్కట్లు ఎదురయ్యాయి.

చినుకుల కోసం ఎదురుచూపులు

కొత్తపల్లి, మే 20: మండలంలో గత2 రోజులుగా సాయంత్రమయ్యేసరికి ఆకాశంలో దట్టమైన మేఘాలు ఆవరిస్తు న్నాయి. గంట పాటు మబ్బులు అలా మురిపించి ఎటు వంటి చినుకులు రాలకుండా ప్రజలను నిరాశకు గురిచేస్తున్నాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఠారెత్తించే ఎండతో ప్రజలు సతమతమవుతున్నారు. చుట్టపక్కల గ్రామాల్లో, పట్టణాల్లో రోజూ ఏదొక సమయంలో వర్షాలు దంచికొడుతున్నా.. తీరప్రాంతాల్లో చిరు జల్లులు కూడా కురవక పోవడంతో ప్రజలు నిరాశ చెందుతున్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

డీఎస్పీ హనుమంతరావు



చెందుర్తిలో మాట్లాడుతున్న డీఎస్పీ

గొల్లప్రోలు రూరల్, మే 20: శాంతిభద్రతలకు విఘాతం కలిగించే రీతిలో ఎవ్వరు వ్యవహరించినా కఠిన చర్యలు తీసుకుంటామని కాకినాడ డీఎస్పీ హనుమంతరావు హెచ్చరించారు. గొల్లప్రోలు మండలం చెందుర్తిలో సోమవారం సాయంత్రం గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు వెల్లడి తదితర సమయాల్లో ఎటువంటి ర్యాలీలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. సమావేశంలో పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్‌ఐ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

దళితులకు న్యాయం చేయాలి



ఏలేశ్వరంలో తహశీల్దార్‌కి వినతి ఇచ్చిన బాధితులు

ఏలేశ్వరం, మే 20: దళితులకు న్యాయం చేయాలంటూ తిరుమాలి గ్రామానికి చెందిన పలువురు ఏలేశ్వరం తహశీల్దార్ రంగారావు, ఎస్‌ఐ సతీష్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. తిరుమాలి గ్రామానికి చెందిన సుమారు 19మందికి ఆచార్య వినోబాబా భూదాన భూమి హైదరాబాద్ హరాదాన బోర్డు వారు సుమారు 8ఎకరాల భూమి పట్టాలు ఇచ్చారని అప్పటి నుంచి భూమిని సాగు చేసుకుంటున్నామని ఇప్పుడు భూమిజోలికి వస్తే చంపుతామని వాగు గణేశ్వరరావు, వరుపుల వీరబాబు బెదిరిస్తున్నారని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో దిమ్మేటి లక్ష్మి, పారపల్లి అర్జమ్మ, సత్తిబాబు, నేరియ్య ఫిర్యాదు చేశారు. దళితులకు ఇచ్చిన భూదాన పట్టాలపై విచారణ జరిపి న్యాయం చేకూర్చాలని బాధితులు తహశీల్దార్ రంగారావుకు వినతి అందజేశారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



తహశీల్దార్‌కు వినతి అందజేస్తున్న కార్మికులు

సామర్లకోట, మే 20: సామర్లకోట రాక్ సిరామిక్ పరిశ్రమలో కార్మికులను తొలగించడాన్ని నిరసిస్తూ ఆ సంస్థకు చెందిన పలువురు కార్మికులు సోమవారం సామర్లకోట తహశీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ముందస్తు సమాచారం లేకుండా 30 మంది కార్మికులను విధుల నుంచి తొలగించడం అన్యాయమన్నారు. ప్రభుత్వ అధికారులు సత్వరం స్పందించి తొలగించిన కార్మికులను తిరిగి విధులోకి తీసుకునేలా న్యాయం చేయాలని తహశీల్దార్‌కు అందించిన వినతిపత్రంలో కార్మికులు కోరారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్!

సామర్లకోట, మే 20: సామర్లకోట-పిఠాపురం ప్రధాన రహదారిలో పాత్రుళ్ళ వీధికి వెళ్ళే కూడలి వద్ద షిర్డీసాయి బాబా ఆలయం పక్కన విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పాదులు, తుప్పలు అలుముకోవడంతో విద్యుత్‌ఘాతానికి గురయ్యే ప్రమాదపరిస్థితులు పొంచి ఉన్నాయని స్థానికులు తీవ్ర భయాందోళనలు చెందుతున్నారు. గేదె ఒకటి విద్యుత్ స్తంభానికి ఉన్న పాదులను, పచ్చికను మేతమేసేందుకు ప్రయత్నించగా ఆ పాదుల ద్వారా విద్యుత్ ప్రవహించడంతో సదరు గేదె విద్యుత్ ఘాతానికి గురైంది. సమీపంలోనే ఉన్న పలువురు సమీపంలో ఉన్న ఎయిర్ బ్రేక్ స్విచ్ ఆఫ్ చేయడంతో ప్రమాదం తప్పింది. లేకుంటే రూ.50 వేల విలువైన గేదె విద్యుత్‌ఘాతానికి మృతిచెంది ఉండేదని పలువురు చెబుతున్నారు. ప్రతీనెలా నాలుగు దఫాల పాటు ట్రీకటింగ్ పేరిట గంటల తరబడి విద్యుత్ నిలుపుదల చేస్తున్నప్పటికీ ట్రాన్స్ ఫార్మర్ల వద్ద తుప్పలు, పాదులు తొలగించడం లేదని విద్యుత్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా విద్యుత్ ఉన్నతాధికారులు సత్వరం స్పందించి ట్రాన్స్ ఫార్మర్ల వద్ద రక్షణచర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



ట్రాన్స్‌ఫార్మర్ పైకి ఎగబాకిన పాదులు

ఓట్ల లెక్కింపునకు సహకరించాలి

జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



పెద్దాపురంలో మాట్లాడుతున్న ఎస్పీ

పెద్దాపురం, మే 20: ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపునకు ప్రజలు, రాజకీయ పార్టీలకు సంబంధించిన ప్రతినిధులు సహకరించాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ కోరారు. స్థానిక అంబేడ్కర్ భవనంలో సోమవారం డీఎస్పీ లతాకుమారి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాకినాడ జిల్లా పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో రాజకీయ పార్టీలకు సంబంధించిన పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలిగించకుండా అధికారులకు సహకరించాలని ఆయన కోరారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు నిర్వహించకూడదన్నారు. సమావేశంలో సీఐ రవికుమామర్, ఎస్‌ఐ సురేష్ పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవు

కాకినాడ క్రైం, మే 20: పశువుల అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవని, పశువుల,జంతువుల సంరక్షణ చట్టాల అమలు కోసం జిల్లాకు ప్రత్యేకంగా నోడల్ అధికారిని నియమించినట్లు జిల్లా ఎస్పీ ఎస్ సతీష్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ హైకోర్టు ఆదేశాల మేరకు, డీజీపీ హరీష్‌కుమార్ ఉత్తర్వుల మేరకు పశువుల అక్రమ రవాణా నివారణ, సంరక్షణ కోసం ఏఎస్పీ (పరిపాలన) ఎంజేవీ భాస్కరరావును కాకినాడ జిల్లా స్థాయి నోడల్ అధికారిగా నియమించడం జరిగిందన్నారు. ఎక్కడైనా జంతువులు అక్రమ రవాణా, అక్రమ వధ విషయంపై ప్రజలకు సమాచారం తెలిసినా, ఇబ్బంది కలిగినా సమాచారం ఉంటే 9440796501కు ఫోన్ చేయాలని కోరారు.

జనసైనికులకు అండగా ఉంటాం

జనసేన పిఠాపురం కోఆర్డినేటర్ మర్రెడ్డి



జనసేన కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న మర్రెడ్డి, నాయకులు

పిఠాపురం/కొత్తపల్లి, మే 20: జనసేన కార్యకర్తలు, జనసైనికులు, వీరమహిళల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ వారికి అన్ని విధాల అండగా ఉంటామని జనసేన పిఠాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామానికి చెందిన చెప్పుల నానిబాబు కుటుంబసభ్యులను జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు మర్రెడ్డి సోమవారం పరామర్శించారు. కుటుంబానికి లక్ష రూపాయిల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఉప్పాడకు చెందిన జనసేన కార్యకర్త కోన రాజు అకాల మరణం చెందడంతో అతడి కుటుంబానికి లక్ష రూపాయిలు అందించారు. కార్యక్రమంలో జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి జ్యోతుల శ్రీనివాస్, నాయకులు పిల్లా శివశంకర్, డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, తోలేటి శిరీష్, జ్యోతుల సతీష్, వెన్నా జగదీష్, సలాది లక్ష్మీనారాయణ, పినకా వెంకట్రావు, ఓదూరి కిషోర్, గంజి గోవిందు, అడపా శివరామకృష్ణ, సూరినీడి శ్రీను తదితరులు ఉన్నారు.

పది రోజుల ముందే ఏజెంట్ల వివరాలివ్వండి

కాకినాడ సిటీ ఆర్వో వెంకటరావు

కార్పొరేషన్ (కాకినాడ), మే 20: ఎన్నికల కౌంటింగ్‌కు హాజరయ్యే ఏజెంట్ల వివరాలను కనీసం పది రోజుల ముందు తమకు అందజేయాలని కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు పోటీలో ఉన్న అభ్యర్థులకు సూచించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో సోమవారం పోటీలో ఉన్న అభ్యర్థులు వారి తరపు ప్రతినిధులతో సమావేశమయ్యారు. కౌంటింగ్ ప్రక్రియపై వీరికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్వో వెంకటరావు మాట్లాడుతూ కౌంటింగ్‌కు హాజరయ్యే అభ్యర్థుల తరపు ఏజెంట్లకు సంబంధించిన సమాచారాన్ని ముందుగా తెలియజేస్తే విచారణ అనంతరం వీరికి పాస్‌లు అందజేస్తామన్నారు. జూన్4వ తేదీ ఉదయం తొలుత పోస్టల్ బ్యాలెట్‌ను లెక్కిస్తామని, సమాంతరంగా ఈవీఎంల లెక్కింపు ప్రక్రియ కూడా ప్రారంభిస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఏఆర్వో చల్లన్నదొర, ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో

ఒక కోర్సు చదివితే మరో కోర్సుకు సర్టిఫికెట్

కళాశాలపై చర్యలు తీసుకోవాలని వినతి



తమ సర్టిఫికెట్లను చూపిస్తున్న విద్యార్థులు

కలెక్టరేట్(కాకినాడ), మే 20: ఒక కోర్సులో విద్యను అభ్యసిస్తే మరొక కోర్సుకి సంబంధించిన సర్టిఫికెట్లు కళాశాల యాజమాన్యం ఇస్తుందని, దగా చేసిన ఆ కళాశాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్ జె.నివాస్‌కు కలెక్టరేట్‌లో స్థానిక పీవీఆర్ ట్రస్ట్ డిగ్రీ కళాశాల విద్యార్థులు వినతిపత్రం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు కళాశాల చేసిన మోసాన్ని వెల్లడించారు. తామంతా బీఎస్సీ కోర్సు చేస్తే వారు ఒకేషనల్ కోర్స్ సర్టిఫికెట్ అందిస్తున్నారన్నారు. తామంతా సుమారుగా మూడేళ్ల నుంచి పెద్దఎత్తున ఫీజులు చెల్లించి చదువుకుమన్నారు. తమ ముందు బ్యాచ్ బీఎస్సీ కోర్సు చదివితే వారికి ఒకేషనల్ కోర్సు చేసినట్టుగా సర్టిఫికెట్ ఇచ్చారని, ఇప్పుడు ఆ సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్ చెల్లదంటూ వారికి మెడికల్‌శాఖ చెప్పడంతో తామంతా తీవ్ర ఆవేదన చెందామన్నారు. తమ ముందు బ్యాచ్ వారికి ఒకేషనల్ సర్టిఫికెట్ ఇచ్చారని, అదేవిధంగా తమకు ఒకేషనల్ కోర్సు సర్టిఫికెట్ ఇస్తారా అని పీవీఆర్ కళాశాల యాజమాన్యాన్ని అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం ఈ విషయంపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ నేతలు గట్టి సత్యనారాయణ, చిలుకూరి రామ్ కుమార్ తదితరులు వచ్చి న్యాయం చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఎస్.అన్నవరంలో శ్రీనివాసుని కల్యాణ మహోత్సవాలు

తుని రూరల్, మే 20: మండలంలోని ఎస్.అన్నవరం గ్రామంలో శ్రీదేవిభూదేవి సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో వార్షిక కల్యాణ మహోత్సవాలు అట్టహాసంగా జరుగుతున్నాయి. సోమవారం స్వామివారి సన్నిధిలో శ్రీలక్ష్మీనారాయణ వ్రతం, శ్రీకృష్ణ తులాభారం కార్యక్రమాలను ఆలయ పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.



నారాయణ వ్రతంలో పాల్గొన్న భక్తులు



కమిషనర్ దంపతులకు చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

దేవదాయశాఖ కమిషనర్ పూజలు

గొల్లప్రోలు రూరల్, మే 20: గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణా సమేత నాగేశ్వరస్వామి ఆలయాన్ని దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ సందర్శించారు. సోమవారం తన సతీమణి స్వర్ణశ్రీతో కలిసి అపర్ణాదేవిని దర్శించుకుని పూజలు నిర్వహించి కుంకుమపూజల్లో పాల్గొన్నారు. ఆలయ వేదపండితులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ప్రభాకరశాస్త్రిలు క్షేత్ర విశిష్టతను తెలియజేశారు. అమ్మవారి చిత్రపటాన్ని, వ్రతకల్ప పుస్తకాన్ని అందించి కమిషనరు దంపతులను శేషవస్త్రాలతో సత్కరించారు. ఆలయ పరిసరాలను కమిషనర్ తిలకించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గారపాటి బుజ్జి, ఉపసర్పంచ్ దాసం వెంకటేష్ పాల్గొన్నారు.

భీమేశ్వరస్వామికి విశేష పూజలు

సామర్లకోట, మే 20 సామర్లకోట కుమార రామ భీమేశ్వ రాలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో వేదపండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబులతో ముందుగా భీమేశ్వ రస్వామికి విశేష అభిషేక పూజలు, బాలాత్రిపుర సుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. నూతన పట్టువస్త్రాలతో స్వామి,అమ్మవార్లను సర్వాంగసుందరంగా అలంకరించారు. ఆలయ ఆవరణలో నిత్యాన్నదాన పథకంలో సుమారు 600 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించగా, ఆలయం వెలుపల భీమేశ్వరా అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో 500 మందికి అన్నప్రసాదాన్ని అందజేశారు.



భీమేశ్వరస్వామికి విశేష అలంకరణ

రాజ్యలక్ష్మికి వెండి చీర వితరణ



ఈవోకు వెండి చీర అందజేస్తున్న దాత

తాళ్లరేవు, మే 20: కేశవస్వామి దేవస్థానం వార్షిక కల్యాణ మహోత్సవం వైశాఖ శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా రాజ్యలక్ష్మి అమ్మవారికి కేశవపురం గ్రామస్తులు జొన్నలగడ్డ సూర్యనారాయణమూర్తి తల్లిదండ్రులు భాస్కరమ్మ,రామలింగ జ్ఞాపకార్థం రూ.3 లక్షలు విలువచేసే 3కిలోల వెండి చీరను సోమవారం దేవస్థానం కార్యనిర్వహణాధికారి యర్రా వెంకటేశ్వరరావు, అర్చకులు శ్రావణకుమార్‌కు అందజేశారు. దాతలను అభినందించారు.దేవస్థానం సిబ్బంది తదితరులున్నారు.

కూటమి గెలవాలని పూజలు

జగ్గంపేట, మే 20: ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అత్యధిక స్థానాలు గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేయాలని, పవన్‌కల్యాణ్ పిఠాపురంలో భారీ మెజార్టీతో గెలవాలని జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ జ్యోతిర్లింగాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఓంకారేశ్వరుని, మామరేశ్వర్ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

రాచపల్లిలో ప్రత్యేక పూజలు

ప్రత్తిపాడు, మే 20: మండలంలోని రాచపల్లిలోని అరుణాచలేశ్వర స్వామికి విశేష పూజలు నిర్వహించారు. రమణ సేవా శ్రమ నిర్వాహకుడు రమణానంద స్వామి ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు విశిష్ట పూజల్లో పాల్గొన్నారు.

జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

జగ్గంపేట, మే 20: సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు పురస్కరించుకుని మంగళవారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో భారీ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి చిత్రపటానికి పాలభిషేకం చేశారు. కేక్ కట్ చేసి స్వీట్లు, మజ్జిగ పంపిణీ చేశారు. అభిమానులు పల్లెకల దయాసాగర్, హరి, సాయిరామ్,సుధ, కిషోర్, మణికంఠ పాల్గొన్నారు.

'మట్టిట్రాక్టర్లను నిలుపుదల చేయాలి'

తాళ్లరేవు, మే 20: తాళ్లరేవు మెయిన్‌రోడ్డుపై విచ్చలవిడిగా తిరుగుతున్న మట్టిట్రాక్టర్లను నిలుపుదల చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. రోడ్డుపై మట్టిట్రాక్టర్లు అతివేగంగా తిరుగుతుంటే ఎదురొచ్చే ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు మట్టి ట్రాక్టర్లను ఆపి వేయాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

శంకర్రావుకు గౌరవ డాక్టరేట్

తుని రూరల్, మే 20: సామాజిక సేవలో విశిష్ట కృషి చేసిన విద్యుత్ శాఖ రిటైర్డ్ అకౌంట్ ఆఫీసర్ అలంక శంకర్రావుకు గౌరవ డాక్టరేట్ వరించింది. హర్యానా రాష్ట్రానికి చెందిన ఎంబీఆర్ యూనివర్శిటీ సమాజంలో విశిష్ట సేవలంది చిన వ్యక్తులకు ఏటా గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తారు. ఈ ఏడాది శంకర్రావుకు అందించారు. తుని తహశీల్దార్ భరత్ రెడ్డి, తొండంగి తహశీల్దార్ బాలకృష్ణ రెడ్డి అభినందించారు.

వేసవి శిక్షణా శిబిరం

ఏలేశ్వరం, మే 20: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడమే వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని స్థానిక గ్రంథాలయ పాలకులు కవికొండ సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం వేసవి శిక్షణా శిబిరంలో విద్యార్థులకు చిత్రలేఖనం, పొడుపు కథలు, జనరల్ నాలెడ్జ్‌పై అవగాహన కల్పించారు.

రోడ్డుపై పడిన తాటిచెట్టు

పిఠాపురం రూరల్, మే 20: ఈదురుగాలులతో పిఠాపురం మండలం బి.కొత్తూరు-పి.తిమ్మాపురం రహదారిపై తాటిచెట్టు నేలకూలింది. దీంతో ఆ మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రూరల్ ఎస్‌ఐ గుణశేఖర్ అక్కడకు చేరుకుని స్థానికులతో కలిసి రోడ్డుకు అడ్డుగా పడిన తాటిచెట్టును పక్కకు తొలగించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. ఎస్‌ఐ చొరవను పలువురు అభినందించారు.



తాటిచెట్టును తొలగిస్తున్న ఎస్‌ఐ, స్థానికులు